ప్రశంస పత్రాలు అందజేత

విశ్వంభర, ఎల్బీనగర్ : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా.కాచం సత్యనారాయణ చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారులు చంటి, జగదీష్, శేఖర్ లు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం అందచేస్తానని చెప్పిన పథకాలను అందరికీ అందేలా కాచం సత్యనారాయణ చొరవ తీసుకోవాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడుగా కాచం సత్యనారాయణ ఇటీవల నియామకమైన సందర్భంగా ఉద్యమకారులు దేవులపల్లి వెంకన్న, ఇరుగు శ్రీధర్, చంటి, శేఖర్, జగదీష్, కొమ్ము గణేష్, కొమ్ము రాజు లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

(విశ్వంభర, ఎల్బీనగర్)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

విశ్వంభర, ఢిల్లీ : ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మర్యాద పూర్వకంగా కలిశారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మల్లికార్జున్ ఖర్గేతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరికి ఖర్గే అభినందనలు తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఫలాలు ప్రతి పేదవాడికి చేరేవరకు.. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని ఖర్గేకు వాకిటి శ్రీహరి తెలిపారు.

పీఎం మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

విశ్వంభర, మలక్ పేట్ : తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ రాష్ట్ర దివ్యాంగుల కన్వీనర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సందర్భంగా చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు మొదటగా వికలాంగులు పేరు తీసి దివ్యాంగులుగా అని పేరు మార్చి, 3 శాతం ఉన్న రిజర్వేషన్ 4 శాతం పెంచిన గొప్ప మనసు గలవాడు మన ప్రధానమంత్రి అని కొనియాడారు. వికలాంగుల సాధికారిక సంఘం ఓలా రాజ్యలక్ష్మి , స్వప్న, ప్రియా, ఈశ్వర మ్మ, మరుగుజ్జు సంఘం అధ్యక్షుడు సైదులు, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు

ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేశామన్న సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పాలనను సమర్థవంతంగా, సాంకేతికంగా అందించేందుకు రెండెకరాల్లో నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ ఎఫ్‌సీడీఏ కార్యాలయాన్ని రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ లోగో, పోర్టల్, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. ఫ్యూచర్ సీటీ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో కలిసి సీఎం పరిశీలించారు. ఫ్యూచర్‌సిటీలో పాలన దిశగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ముందడుగు వేయనుంది. అనంతరం ఆయన మాట్లాడారు.బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములు విలువ ఎక్కువన్న సీఎం, కుతుబ్‌షాహీలు, నిజాంలు కృషివల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. హైటెక్‌సిటీ అంటే నవ్విన వాళ్లు ఉన్నారని, విమానాశ్రయం, జీనోమ్‌వ్యాలీ, ఐటీ సంస్థలను ఆనాడు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఐటీ పరిశ్రమలు రాకుంటే ఈనాడు యువతకు ఉద్యోగాలు వచ్చేవా? అని ప్రశ్నించారు.నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా? ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే ప్రజలు వారినే రద్దు చేయటం ఖాయమని జోస్యం చెప్పారు. ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదని, ప్రపంచానికి అని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పార్టీ రద్దయిన వెయ్యి నోటు అని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. ఆ పార్టీ నేతలు ప్రవర్తన ఇలాగే కొనసాగితే, వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని విమర్శించారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఫ్యూచర్ సిటీ మారుతుందని తెలిపారు.150 రోజుల్లోనే ఎఫ్‌సీడీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. నిన్న వర్షానికి రోడ్లు మొత్తం వరద నీటితో నిండిపోయాయి. రోడ్లపై వరద పారుతుంటే.. దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? చెరువుల్లోకి వెళ్లాల్సిన నీరు కబ్జాల వల్ల రోడ్లపైకి వస్తోంది. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎర్ర సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూములిచ్చారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే ఉద్యమం నిరాటంకంగా కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.పదేళ్లలో విధ్వంసం చేశారని, అందుకే వ్యవస్థలన్నింటినీ గాడిన పెడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం'' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన టీజీఐఐసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

ప్రారంభించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, హాజరైన ఎం.డి శశాంక

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు 2026 హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా సంబరాలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులకు ఈ క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని చెప్పారు. క్రీడల ప్రధాన ఉద్దేశం కేవలం గెలవడం మాత్రమే కాదని, అందరూ కలిసికట్టుగా పాల్గొనడమే అసలైన విజయమని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య ఐకమత పెంచడానికి, స్నేహభావం చాటడానికి ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందించడానికి ఈ పోటీలు తోడ్పడతాయని వివరించారు. క్రీడాకారులందరూ జట్టు స్ఫూర్తితో ఆడాలని సూచించారు.ఈ క్రీడా వేడుకల్లో భాగంగా సంస్థకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం తో స్టేడియం లో సందడి వాతావరణం నెలకొంది. రెండు రోజుల పాటు సాగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ మరియు లెమన్ స్పూన్ , స్విమ్మింగ్ వంటి పలు రకాల పోటీలలో పాటు చెస్ , క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన సమ్మేళనమును జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

విశ్వంభర, ఎల్బీనగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 ,17న జరిగే రాష్ట్ర యువజన సమ్మేళనం ను జయప్రదం చేయాలని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్లో పోస్టర్ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో యువతీ, యువకులు ఉద్యోగ కల్పన లేక అనేక అవస్థల గురి అవుతున్నారని ఈ అవస్థల తీర్చడం కొరకు యువత సరియైన మార్గంలో పోవడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయాలని యూనియన్ గవర్నమెంట్ అధికారంలోకి రాకముందు సంవత్సరానికి మూడు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను విస్మరించి ప్రజల మధ్యన ఐక్యతను చిచ్చుపెట్టి తన పబ్బం గడుపుతుందని అన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు నెలకొల్పుతున్నారు కానీ స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. ఈ యువజన సమ్మేళనంలో యువతను చైతన్యపరిచే రాష్ట్రంలో యువతీ యువకులను సమీకరించి యువత సమస్య పరిష్కారం కొరకు సిపిఎం ముందుంటారని వారి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, బి సామెల్, జగదీష్, ఈ నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి, నరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, ఎల్బీనగర్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సిపిఎం నాయకులు ఎం వీరయ్య, కట్టా శ్రీనివాస్, ఎం కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి పడి వ్యక్తి మృతి

విశ్వంభర, ఎల్బీనగర్ : ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట మోహన్ నగర్ కాలనీ న్యూ ఆర్. బి.ఐ కాలనీ లోని బిలకంటి గోపి అను వ్యక్తి యొక్క ఇంటి యందు కుంచల వెంకటేశ్వర్లు (47) మేస్త్రి పని చేస్తున్నాడు. మంగళవారం 9వ తేదీన మధ్యాహ్నం సమయంలో మొదటి అంతస్తు లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడగా ముక్కులో, నోటి నుంచి రక్తం వచ్చి లోపలి కాగా వెంటనే తనతో పాటు పనిచేయు వాళ్ళు , ఇంటి యజమాని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ను ద్వారా వనస్థలిపురంలోని గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ కు తీసుకువెళ్లారు.. అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి చూడగా మృతుడు అప్పటికే మరణించినట్లు తెలిపినాడు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా (శవ పరీక్ష) అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బల్కంపేట ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు!

విశ్వంభర, హైదరాబాద్ : మాజీ ప్రధాని నెహ్రూ తర్వాత భారతదేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానమంత్రిగా మన గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని.. మహంకాళి జిల్లా భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో శ్రీ బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. నరేంద్ర మోదీ గారికి అమ్మవారి ఆశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, వారి పరిపాలనలో భారతదేశం మరింత ఔన్నత్యాన్ని సాధించాలని మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నాపజ్జుల సూర్య ప్రకాష్, స్టేట్ జాయింట్ కన్వీనర్ మణిదీప్ మరియు మహంకాళి జిల్లా ఎండోమెంట్ సెల్ బృందం సభ్యులు పాల్గొని, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేశారు.

అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపిన స్థిరాస్తి వ్యాపారి

విశ్వంభర, హైదరాబాద్ : ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపిన ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది.
కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

రణరంగంగా పశ్చిమాసియా..

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హర్మూజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది.అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జీసీ అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికాస్థీట్‌తో పాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లలో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యూఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అమెరికా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ కూల్చేశాం..

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా MQ9 రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.

క్షేమంగా ఉండాలంటే.. ఇరాన్ వార్నింగ్

దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. యూఎస్ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. దాడులు, బెదిరింపులకు తమ సాయుధ దళాలు కచ్చితంగా స్పందిస్తాయన్నారు. క్షేమంగా ఉండాలనుకుంటే.. వెంటనే ఈ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ బలగాలను హెచ్చరించారు.

ఇరాన్ భారీ మూల్యం చెల్లిస్తుంది: ట్రంప్ వార్నింగ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌ను తాము పూర్తిగా ఓడించామని.. సైనిక పరంగా ఆ దేశం సర్వనాశనం అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైందన్నారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి సమయం మించిపోతున్నా అక్కడి నేతలు ఇంకా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ఇరాన్ నేతలవి మాటలే కానీ చేతలు ఏమీ ఉండవని ట్రంప్ ఎద్దేవా చేశారు. వారికి మేలు చేయడానికి తాము త్వరగా యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటుంటే ఇరాన్ నేతలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఒప్పందం విషయంలో ఆలస్యం చేస్తున్నందుకు టెహ్రాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై తమ సైన్యం కొత్త దాడులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఆ దేశం మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదిలావుండగా టెహ్రాన్‌వాషింగ్టన్‌ల మధ్య ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రయత్నంలో భాగంగా ఖతార్ ప్రతినిధులు ఇరాన్‌కు వెళ్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108